క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లై ఓవర్ పనుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ నిజాంపేట్, ఎంఎస్ఎస్, ఎస్ఎల్‌జీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాచుపల్లి పోలీస్‌స్టేషన్, తహసిల్దార్ కార్యాలయం, బాచుపల్లి సిగ్నల్స్ నుంచి శ్రీకర విల్లాస్ వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు పొందిన వారితో దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం సభ్యులు

జగద్గిరిగుట్ట: భూదేవి హిల్స్ పరపతి సంఘం ఆధ్వర్యంలో రెండు నెలలుగా బ్యూటీషియన్, కుట్టు మెషిన్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి శనివారం దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పద్మావతి, లక్ష్మి కుమారి, జయ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని సీసాల బస్తీలో మల్లారెడ్డి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

చర్మాస్ రోడ్డులో హరితహారం



మొక్కలు నాటుతున్న మున్సిపల్ అధికారులు

కుత్బుల్లాపూర్: హరితహారం కార్యక్రమంలో భాగంగా శనివారం దూలపల్లిలోని చర్మాస్ రోడ్డులో మున్సిపల్ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: చింతల్ శ్రీ సాయి కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు శనివారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానిక సంక్షేమ సంఘం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

కుత్బుల్లాపూర్: రోడ్ల పక్కన అక్రమణలపై అల్వాల్ ట్రాఫిక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చర్యలు చేపట్టారు.. శనివారం ఆల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కుత్బుల్లాపూర్–సుచిత్ర రోడ్డుపై ఏర్పాటు చేసి డబ్బాలను, దుకాణాలను తొలగించారు. గతంలో సైతం ఈ రోడ్డును అక్రమణలను తొలగించినా ఒక రోజు వ్యవధిలోనే తిరిగి డబ్బాలను ఏర్పాటు చేయడం విశేషం. ఈసారి అధికారులు ఏ మేరకు అక్రమణలను అడ్డుకుంటారో వేచి చూడాల్సిందే.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సుభాష్‌నగర్: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి వస్తువులు ఎత్తుకెళ్లిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. సీఐ వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూరారం కాలనీ జీవనజ్యోతి నగర్ చెందిన ఆకుల రమేష్ తన తల్లి అస్థికలను నదిలో కలిపేందుకు కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం వెళ్లాడు. శనివారం వారు తిరిగి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఐదు తులాల బంగారం ,వెండి వస్తువులను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి చోరీకి పడినట్లు గుర్తించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈవినింగ్ క్యాంపెనింగ్‌కు విశేష స్పందన

- పోలింగ్ కేంద్రాల వారీగా ముసాయిదా జాబితా ప్రదర్శన
- పెద్ద ఎత్తున తరలివస్తున్న ఓటర్లు



ఓటర్ల జాబితాను చెక్ చేసుకుంటున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: డివిజన్ పరిధిలో చేపట్టిన ఈవినింగ్ ఓటర్ల ప్రత్యేక క్యాంపెనింగ్ కు విశేష స్పందన లభిస్తోంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జంట సర్కిళ్లతో పాటు కొంపల్లి ,దుండిగల్ మున్సిపాలిటీ, నిజాంపేట్ నగర కార్పొరేషన్ పరిధిలో ఓటర్ జాబితాను బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల వారీగా ప్రదర్శనకు ఉంచారు.. దీంతో పెద్ద ఎత్తున ప్రజలు తమ ఓటు ఉందా..! లేదా..!! అని ఆరా తీస్తూ కనిపించారు.. శని ఆదివారాల్లో నిర్వహించనున్న ఈ క్యాంపెయిన్‌ను ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు తెలిపారు. కొత్త ఓటర్ నమోదు, పేర్ల తప్పులు, ఇతర ప్రాంతాల్లో బదిలీ తదితర అంశాలపై బీఎల్ఓ లు ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

6,39,634 మంది ఓటర్లు, 582 కేంద్రాలు

కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో ప్రతి పోలింగ్ కేంద్రానికి 1400 మంది ఓటర్లు ఉండేలా ప్రణాళిక రూపొందించి అందుకు తగ్గట్టుగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఓటర్లు మొత్తం 6,39,634 నమోదు అయ్యారు. ఇందులో పురుషులు 3,29,491 కాగా మహిళలు 3,10,015 ఇతరులు 128 మంది ఉన్నట్లు గుర్తించారు. శనివారం ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాను ప్రదర్శనలో ఉంచారు. ఇప్పటికే అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు పంపిణీ చేశారు.

లక్షకు పైగా పెరిగిన ఓటర్లు..

గడిచిన ఎన్నికలకు ఈ ఎన్నికలకు భారీగా ఓటర్ల సంఖ్య పెరగడంతో ఎన్నికలు రసవత్తరంగా మారే అవకాశాలు ఉన్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గతంలో 5,16,089 మంది ఓటర్లు ఉండగా తాజాగా లెక్కల ప్రకారం 6,39,634 గా నమోదు కావడం విశేషం. గత అసెంబ్లీ ఎన్నికల కంటే తాజా గణాంకాల ప్రకారం 1,23,545 ఓటర్లు పెరగడం విశేషం. అంతేకాకుండా అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు సైతం కొత్త ఓటు నమోదు చేసుకుని అవకాశం కల్పించడంతో నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

9 మంది ఏఈఆర్వోల నియామకం..

నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించేందుకు తొమ్మిదిమంది ఏఈఆర్‌ఓ ల నియామకం పూర్తిచేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు పోలింగ్ కేంద్రాల వారీగా వారికి బాధ్యతలు అప్పగించారు. సుచరిత, సత్యనారాయణ, శ్రీహరి, పూల్ సింగ్, రామకృష్ణారావు, మల్లారెడ్డి, శ్రీనివాసరావు, వినయ్ కుమార్, ఉదయ్ కుమార్ లను నియమించి ఓటర్ల సందేహాలకు ఎలా సమాధానం చెప్పాలన్న విషయంపై ఇప్పటికే పలు దఫాలుగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఉప కమిషనర్లు నాగమణి, మల్లయ్య వ్యవహరిస్తున్నారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు ప్రక్రియ



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పోలింగ్ స్టేషన్లో బీఎల్వోలు ఓటర్ల ముసాయిదాతో సిద్ధంగా ఉన్నారు. ప్రతి ఒక్కరూ అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు. ఫామ్ నెంబర్ -6,7,8 పోలింగ్ కేంద్రాల వద్ద అందజేస్తారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ కొత్త ఓటర్ల నమోదు ,షిఫ్టింగ్, పేర్లలో తప్పులు ఉంటే వివరాలు నమోదు చేసి దరఖాస్తు ఇస్తే పరిశీలిస్తాం. ఆదివారం సైతం పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓ లు అందుబాటులో ఉంటారు . సెప్టెంబర్ 2, 3 తేదీల్లో సైతం ఈ ప్రత్యేక క్యాంపెయిన్ కొనసాగుతుంది. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సైదులు, కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి

మదర్ థెరిస్సా సేవలు ఎనలేనవి

నిజాంపేట్: మదర్ థెరిస్సా సేవలు ఎనలేనివని నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో మదర్ థెరిస్సా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, నర్సింగ్ రావు, శివ, వెంకటేశ్వరరావు, రవి, శ్రీనివాస్ రావు, దాలీ నాయుడు, అరిగే ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

◆ జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుంనగర్‌లో మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని అశోక వికలాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో ఆర్‌సీఎస్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కొలుకుల జైహింద్, వైద్యులు సంతోష్, సాయి, వికలాంగుల సంఘం నాయకులు ఏసుబాబు, శంకర్, శ్రావణ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ నేత కొలన్ హన్మంతరెడ్డి మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పితాని శ్రీనివాసరావు, ఎక్సక్యూటివ్ డైరెక్టర్, ముంగండ వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోచారం ప్రభాకర్ రెడ్డి, అత్తోట నాగభూషణం, మానేపల్లి నర్సింగరావు, వైస్ ప్రెసిడెంట్, యర్ర దాలినాయుడు, పల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మదర్ థెరిస్సా జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేత కొలన్ హన్మంతరెడ్డి..



నిజాంపేట్‌లో మదర్ థెరిస్సా విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

దుండిగల్: ఆలయాలు ఆధ్యాత్మిక శోభకు నిలయాలని, దేవాలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేశ్ అన్నారు. దుండిగల్‌లోని రాజరాజేశ్వరి దేవి పోచమ్మ ఆలయ పునః నిర్మాణానికి ఆయన రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జక్కుల కృష్ణా యాదవ్, కౌన్సిలర్ ఆనంద్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న కావలి గణేశ్

ఆరోగ్య శ్రీ పథకం పేదలకు వరం

రంగారెడ్డినగర్: ఆరోగ్యశ్రీ పథకం పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు వరమని ఆదర్శనగర్ హౌసింగ్ – బిల్డింగ్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర శంకరయ్య అన్నారు. ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డుల ప్రక్రియ కార్యక్రమంలో భాగంగా శనివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శనగర్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఆరోగ్యశ్రీ పరిమితి రూ.2 లక్షలే ఉండేదని, ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వం పరిమితిని రూ. 5 లక్షలకు పెంచిందన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం దోహద పడుతుందన్నారు. ఆరోగ్యశ్రీ కేంద్రాల్లో ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డు పొందాలనుకునే వారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ జిరాక్స్ జిరాక్స్‌లను జత చేసి దరఖాస్తు చేసుకోవాలనానరు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ప్రతినిధి రేణుక, సహాయకురాలు బిందు, స్థానిక కమిటీ నాయకులు శ్రీనివాస్, కోటేశ్వరరావు, కే శ్రీనివాస్, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ డిజిల్ కార్డుల ప్రక్రియను ప్రారంభిస్తున్న శంకరయ్య తదితరులు

స్త్రీవాదం నేటి అవసరం

బాలీవుడ్ నటి, రచయిత్రి కల్కీ కోచ్లిన్

లక్డీకాపూల్: 'ఫెమినిజం అనేది చాలా తప్పు గా అర్థం చేసుకున్న పదం. చాలా సరళంగా..స్త్రీవాదం అంటే సరిపోతుంది. అందరికి సమా న హక్కులు, అవకాశాలు ఇవ్వాలనేదే స్త్రీవా దం. ఇది నేటి అవసరం కూడా' అని భారతీయ సంతతికి చెందిన బాలీవుడ్ నటి కల్కీ కోచ్లిన్ అన్నారు. పితృస్వామ్య సమాజంలో జీవిస్తున్నందున స్త్రీవాదం అనేది మన సమాజానికి అవసరమన్నారు.శనివారం బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'నిజమైన స్త్రీత్వం' అనే అంశంపై ఆమె మాట్లాడారు. పురుషులంద రూ స్త్రీలకు సమానమైన గౌరవం ఇస్తే ఇబ్బందులు తలెత్తవన్నారు. దక్షిణ భారతదేశంలో జన్మించిన తాను భారతీయ వాతావరణం, ఫ్రెంచ్ కుటుంబ అనుబంధంతో పెరిగానన్నా రు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ రీతూ షా మాట్లాడుతూ స్టైల్ ఐకాన్‌గా పిలిచే కల్కీ కోచ్లిన్ లింగ సమానత్వం కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారన్నారు.ఈఫిల్ టవర్ రూ పకల్పన, నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించిన ఫ్రెంచ్ స్ట్రక్చరల్ ఇంజనీర్ మారిస్ కోచ్లిన్ వంశస్థురాలే ఈ కల్కీ క్లోచిన్ అని చెప్పారు.

నకిలీ బిల్లులతో టోకరా

జీడిమెట్ల: షాపింగ్‌మాల్‌లో పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులు కస్టమర్లకు ఫేక్‌బిల్స్ ఇచ్చి సంస్థకు టోకరా వేసిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్‌లోని వైభవ్ షాపింగ్‌మాల్‌లో సాయిలు సిస్టమ్ ఆపరేటర్‌గా అతని సోదరుడు అనిల్‌కుమార్ సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నారు. వీరు ఇద్దరు గత కొంతకాలంగా వినియోగదారులకు దొంగ బిల్లులు అంటగట్టి సరుకులు ఇస్తున్నారు. దీనిని గుర్తించిన సంస్థ మేనేజర్ కందుల అరుణ్ వారిపై నిఘా ఉంచి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారిని నిలదీయగా రూ.60వేలు స్వాహా చేశామని, తిరిగి చెల్లిస్తామని చెప్పారు. అయితే డబ్బులు తిరిగి ఇవ్వకుంగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతుండటంతో నిందితులపై జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా హరితహారం

దుండిగల్: హరితాహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. స్వాతంత్ర్య వజ్రోత్సవ కోటి వృక్షార్చన కార్యక్రమంలో శనివారం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పట్టణ ప్రకృతి వనంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో విడతల వారీగా హరితాహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, 90 శాతం మేర ఫలితాలు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, మేనేజర్ నర్సింహులు, ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రావ్య, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బండారి మహేందర్‌యాదవ్, సత్యనారాయణ, నేతలు బుచ్చిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లేశ్, రాము, రెవెన్యూ అధికారి సునంద, ఏఈ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కౌన్సిలర్లు..

సమష్టి కృషితోనే ఆకుపచ్చ తెలంగాణ

కుత్బుల్లాపూర్: ఆకుపచ్చ తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజుల రామారం పరిధిలోని ఆక్సిజన్ పార్క్‌లో శనివారం ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు రఘువీరారెడ్డి, ఉమా దేవి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మల్లారెడ్డినగర్‌లో జరిగిన రేణుక ఎల్లమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

◆ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రపంచంలోని అన్ని విషయాలను క్షణాల్లో తెలుసుకోవచ్చని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం ఐడీపీఎల్‌లోని ఎంపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మీడియాను బీఆర్ఎస్ పార్టీ సైనికులు సమర్థవంతంగా ఉపయోగించుకుని సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని, ప్రతిపక్ష పార్టీలు చేసే కుట్రలును, తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు. అనంతరం నియోజకవర్గంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమలు, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, విద్యా కార్యక్రమాలు, ఉపాధి, మహిళా సంక్షేమం తదితర సమగ్ర సమాచారాన్ని పొందుపరిచిన తీతీతీ.జు ఇఙజీశ్రీఙ్ఘ ్చ ఱజీ.ఛౌఖ వెబ్ సైట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆక్సిజన్ పార్క్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

దివ్యాంగులకు బస్ పాస్‌ల అందజేత

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాండ్‌లో శనివారం నిర్వహించిన దివ్యాంగుల బస్‌పాస్ స్పెషల్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా 52 మందికి సిటీ పాస్‌లు, 62 మందికి డిస్ట్రిక్ట్ పాసులు అందజేశారు. టీఎస్‌ఆర్టీసీ కూకట్‌పల్లి డీఎం ఇసాక్ బిన్ మహమ్మద్, సీబీఓలు యాదగిరి, వాసు, మధు, సీఆర్‌సీలు వాసు, శివకుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక బీఆర్ఎస్ యూత్ నాయకులు జైహింద్ దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేశారు.



ఘనంగా ఎంఎల్‌ఆర్ఐటీ స్నాతకోత్సవం

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో స్నాతకోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈపీఏఎం సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ శాంతి కుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యనభ్యసించిన ఎంతో మంది దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని, బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారని, సొంతగా పరిశ్రమలు ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. అనంతరం 2019–23 బ్యాచ్‌కు చెందిన 1123 మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రావు, డైరెక్టర్ అనుశ్రేయ రెడ్డి, కోశాధికారి మమతారెడ్డి, హెచ్ఓడీలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న శాంతికుమార్..

పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు



సుభాష్‌నగర్: జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని పాదచారులు రోడ్డు దాటేందుకు వీలుగా పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. స్టేషన్ పరిధిలోని చింతల్ బస్ స్టాప్, ఏషియన్ థియేటర్, షాపూర్ నగర్ సాగర్ హోటల్, సూరారం నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన పెలికాన్ సిగ్నల్స్ ను ట్రాఫిక్ సీఐ వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల రాకపోకల కారణంగా పాదచారులకు ఇబ్బంది తలెత్తకుండా ఈ సిగ్నల్స్ దోహదపడతాయన్నారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో ఇద్దరు సిబ్బంది వృద్ధులను వికలాంగులను రోడ్డు దాటించేందుకు నియమించినట్లు తెలిపారు.

కళాసిల్క్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన

భాగ్యనగర్‌కాలనీ: నిజాంపేట్ రోడ్డులోని కొలను నారాయణ రెడ్డి గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ ఎగ్జిబిషన్‌లో కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామని నిర్వాహకులు వినోద్ తెలిపారు.

బీజేపీ పాలనలో మత విద్వేషాలు

నిజాంపేట్: కేంద్రంలోని బీజేపీ పాలనలో మత విద్వేషాలు చెలరేగాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరయ్య, నర్సింగ్‌రావు అన్నారు. ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సీపీఎం వర్క్ షాప్‌నకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను పక్కన బెట్టి మతాన్ని స్వలాభం కోసం వాడుకుంటోందన్నారు. రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ మూడో సారి అధికారం చేజిక్కించుకునేందుకు అయోధ్యలోని రామాలయ నిర్మాణాన్ని వాడుకుంటోందన్నారు. మణిపూర్‌లో కుకీ, మైతీ తెగల మధ్య విద్వేశాలు చెలరేగితే ప్రధాని మోదీ విదేశీ పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు ధారదత్తం చేశారని, మణిపూర్ కొండల్లో ఉన్న విలువైన నిక్షేపాలను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరయ్య

ఉల్లాసంగా గ్రీన్ డే వేడుకలు

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్‌లో శనివారం గ్రీన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఆకుపచ్చ దుస్తులు ధరించి వివిధ కూరగాయలతో సందడి చేశారు. వాతావరణంలోని కాలుష్యాన్ని తగ్గించడానికి చెట్ల ప్రాముఖ్యతను తెలిపేందుకు గ్రీన్‌డే ను నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ మండవ సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

